www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 22 అక్టోబర్ 2023

5

అన్నమయ్య

డేటా సైన్స్‌లో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మిట్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు డేటా సైన్స్ రంగంలో ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న ఎల్.సాహితి, పి.పూజిత, జి.ధోరణి చెన్నైలోని సవేత యూనివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోసియంలో ప్రతిభ కనపరచి మొదటి బహుమతి పొందినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో నిర్వహించిన పరిశోధన పత్ర సమర్పణలో మొదటి బహుమతి పొందినట్లు తెలిపారు. మెషిన్ లెర్నింగ్‌పై ఇచ్చిన పరిశోధన పత్ర వివరణ పోటీలలో ఈ బహుమతి లభించినట్లు, ఈ విద్యార్థులకు కోమల్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మెంటార్‌గా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ కుసుమ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు రోజు రోజుకూ పెరుగుతూ పుట్టి (8బస్తాలు) రూ. 25వేలకు చేరుకున్నాయి. దిగుబడి మాత్రం ఆశించన స్థాయిలో లేకపోవడంతో మరో వైపు రైతులు ఆందోళన చెందుతున్నారు. డీసెంబర్‌లో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి(8 బస్తాల) ధర రూ. 12 వేల వరకు పలికాయి. ఆ తర్వాత జనవరి లో రూ.13 వేలకు ధరలు చేరుకున్నాయి. జూన్‌లో రూ.21వేలు పలికి తగ్గుముఖం పట్టాయి. తిరిగి ధరలు పెరిగి ప్రస్తుతం రూ. 24,500 పలుకుతున్నాయి. ప్రస్తుతం నూర్పిడి చేసే ఈ ఖరీఫ్ సీజన్ లో సాగైన వరి ధాన్యం రూ. 16 వేలు పలుకుతున్నాయి.

- ప్రజాశక్తి - చాపాడు

ధర ఘనం.. దిగుబడి శూన్యం

- వరి ధాన్యం ధరలకు రెక్కలు
- పుట్టి రూ. 24,500
- గత ఏడాది ధాన్యం అమ్ముకుంటున్న రైతులు
- కెసికి నీరు విడుదల కాకపోవడంతో తగ్గిన వరి సాగు
- ఇతర పంటలపై మొగ్గు

తగ్గిన వరి సాగు...

ఉమ్మడి కడప జిల్లాలో సాధారణంగా కెసి, కుందూ, బ్రహ్మసాగర్, మైలవరం, గండికోట, పలు చెరువుల కింద వరి పంటను అత్యధికంగా సాగు చేపట్టేవారు. దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు రబీ, ఖరీఫ్ సీజన్‌లలో వరిపంటను సాగు చేసేవారు. దాదాపు లక్ష మంది కౌలురైతులు వరిసాగుపై ఆధారపడి ఉన్నారు. వేలాది మంది వ్యవసాయ కార్మికులు వరిసాగులో పెద్దఎత్తున ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా వరుసగా మూడు సంవత్సరాలు వరిసాగులో నష్టాలు తప్ప, తప్పలాభాలు అనేవి లేకుండా పోయాయి. దీనికి ప్రధానకారణం సరైన మద్దతు ధరలేకపోవడమే. ఎకరా వరి సాగుకు రూ.35 నుంచి రూ. 40వేల వరకు సాగు ఖర్చులు అవుతున్నాయి. పుట్టి వరి ధాన్యం ధర నూర్పిడి సమయంలో రూ. పది వేల లోపు మాత్రమే ఉన్నాయి. 40 బస్తాల దిగుబడి వచ్చినా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు గత ఏడాది వరి సాగును తగ్గించారు. దీంతో క్రమంగా సాగు తగ్గుముఖం పట్టింది. గత ఖరీఫ్‌లో సాగైన వరి ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది వరి సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. జిల్లాలో ప్రధాన నీటి వనరైన కెసికి నీరు విడుదల కాకపోవడంతో సాగు గణనీయంగా తగ్గింది. ఈ ఏడాది 80వేల ఎకరాల వరకు సాగు తగ్గింది. దీంతో ఇతర ఆరుతడి పంటల సాగుకు మెగ్గు చూపుతున్నారు. చాపాడు మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 16 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. అలాంటిది ఈ ఏడాది 3400 ఎకరాలకు పరిమితమైంది.

దిగుబడి తగ్గుముఖం...

గత ఏడాది కంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట నిరాశజనకంగా ఉండటంతో దిగుబడి తగ్గే పరిస్థితి నెలకొంది. గత ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ. 30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొన్నారు. దిగుబడి పెరగడం, ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగు ఖర్చులు పోను రైతులకు ఆదాయం చేకూరింది. ప్రస్తుతం నూర్పిడి చేసే వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. 2012లో అధిక వర్షాలకు, వరద తాకిడికి వరి పంట అధికంగా దెబ్బతింది. వర్షానికి పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.6వేలు నష్టపరిహారం మంజూరైంది. గత ఏడాది ఖరీఫ్ లో సాగు చేసిన లో వరి ధాన్యం ధర రూ. 24 వేలకు పైగా ధర పలుకుతున్నాయి. దీంతో వరి ధాన్యాన్ని నిల్వ ఉంచిన రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.

వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న కూలీలు

వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర..

వరి ధాన్యానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర అందుబాటులో ఉంది. జనవరిలో రూ. 12 వేలు ఉన్న పుట్టి ధర ప్రస్తుతం క్రమేపీ పెరిగి రూ.24 వేలకు పైగా పలుకుతున్నాయి. గతంలో రూ. 17వేలకు మించేవి కావు. ధరలు పెరుగుతుండడంతో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని అమ్మకాలు చేపడుతున్నాం.

- ఓబుళరెడ్డి, రైతు, పాతపాలెం, మైదుకూరు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు..

వరి ధాన్యానికి గతంలో ఎన్నడూ లేని విధంగా ధర వచ్చింది. పాత వరి ధాన్యంతో పాటు వేసవిలో సాగు చేసిన వరి ధాన్యం ధరలు కూడా రూ. 24 వేలకు పైగా పలుకుతున్నాయి. గతంలో వరుసగా అధిక వర్షానికి దెబ్బతిన్నడం, సాగు తక్కువ కావడం, ఇతర ప్రాంతాలకు ఎగుమతికి అనుమతి వంటి కారణాలతో ధరలు పెరిగినట్లు తెలుస్తుంది.

- సుబ్బరాయుడు, వరి ధాన్యం వ్యాపారి, చాపాడు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- కలెక్టర్ గిరీష, ఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేనివని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం ఉదయం జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో కలెక్టర్ గిరీష పిఎస్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరులైన పోలీసు వీరులకు కలెక్టర్ గిరీష, ఎస్‌పి కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్‌పి డాక్టర్ రాజ్ కమల్ ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరమూ అక్టోబర్ 21న పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, 1959 అక్టోబర్ 21 న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. వారి ధైర్యాన్ని, త్యాగాన్ని అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. భారతదేశానికి చైనా, పాకిస్తాన్ తదితర దేశాలతో గల సరిహద్దులలో ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని, ఆ సరిహద్దులలో పర్వతశ్రేణులు, మంచు కొండలు వంటి క్లిష్ట పరిస్థితులు ఉంటాయని, అయినప్పటికీ మన జవానులు దేశ రక్షణలో నిరంతరం మునిగి ఉంటారని చెప్పారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో, చట్టాలను పరిరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో మాత్రమే కాకుండా రాత్రిపూట పెట్రోలింగ్, ట్రాఫిక్‌ను నియంత్రించడం, మెడికల్ ఎమర్జెన్సీలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలలో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు లభిస్తాయని తెలిపారు. వారి త్యాగాలను మరచిపోకూడదని, వారి అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. ఎస్‌పి కృష్ణారావు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగనిరతికి ప్రతి సంవత్సరమూ అక్టోబరు 21న పోలీసు అమరవీరుల దినంగా పరిగణిస్తున్నామన్నారు. దేశభద్రత కోసం పగలనక, రేయనక, విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్ళు, అధికారులు విధులను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా వారు తమ ప్రాణ త్యాగాలను, సేవలను సింహావలోకనం చేసుకుంటూ సేవల అర్థాన్ని పరమార్థాన్ని గుర్తిస్తూ కొనియాడుట మనందరి కర్తవ్యం అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధి నిర్వహణలో పోలీసుల వీరమరణాల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతూనే ఉందని చెప్పారు. అన్నమయ్య జిల్లా ఏర్పడినప్పుడు, జిల్లా పోలీసు కార్యాలయం చుట్టూ రాళ్ళూ, గుట్టలు ఉండి చిన్న అడవి మాదిరి ఉండేది. కానీ హోమ్‌గార్డు నుంచి పై అధికారుల వరకు అందరూ కష్టపడి పనిచేసి, శ్రమదానం చేసి ప్రస్తుతం ఈ రూపు సంతరించుకుందని చెప్పారు. మన కష్టానికి తోడుగా కలెక్టర్ సహకారంతో మన పోలీస్ గ్రౌండ్ సుందరంగా తయారు అయ్యిందన్నారు. జిల్లాలో జాతీయ రహదారులపై ప్రమాదాలు జరుగుతూంటాయని, ఈ ప్రమాదాలు జరిగినప్పుడు గాయాలతో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించటం, సరైన సమయంలో హాస్పిటల్ కు తరలించడం ద్వారా వారి ప్రాణాలను కాపాడటం జరిగిందన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసులు అందరికీ జోహార్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అడిషనల్ ఎస్‌పి డాక్టర్ రాజ్ కమల్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి: అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్‌ఐ రహీముల్లా అన్నారు. పట్టణంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. సిఐఎటి-3 ఆధ్వర్యంలో కమాండెంట్లు నీరజ్ కుమార్ పాండే, రాజేష్ కుమార్ అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండర్లు నిషా మొయిల్ అమర్నాథ్ యాదవ్, కెవి, ప్రసాద్, శివ ప్రసాద్, సంజీవ్, అసిస్టెంట్ కమాండర్లు పాల్గొన్నారు.

కౌలు వేలంలో రూ.2.57 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని తవళం గ్రామం అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయానికి రూ.2,57,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన మామిడి తోటలను సంవత్సర కాలానికి ఫలసాయానికై కౌలుకు ఇవ్వడానికై దేవాదాయ శాఖ అధికారి రవికుమార్ పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటను నిర్వహించగా రూ.2,57,500 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయానికి సంబంధించిన ఇండియన్ బ్యాంక్ అకౌంట్‌లో జమచేస్తామన్నారు. ఆలయానికి వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి రవికుమార్, సర్పంచ్ రెడ్డప్ప, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, వైసిపి మండల నాయకులు ఆర్‌ఐ.రమణారెడ్డి,గంగాధర, శంకర, రవి, రైతులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి ఆపాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పాలసీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని శాంతి సంఘం ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మసీదు నుంచి మూడు రోడ్ల కూడలి వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై క్రూరమైన వైమానిక దాడులు చేయడం ద్వారా చిన్నపిల్లలు మహిళలు అమాయక ప్రజలు బలవుతున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ మౌనం వీడి సంఘీభావం ప్రకటించి ఆ దేశ ప్రజలకు అవసరమైన మెడికల్, ఆహార సామగ్రి పంపిణీ చేసి మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దాడులను ఖండించి వారిని ఆదుకోవాలని పేర్కొన్నారు. వైసిపి నాయకులు సైద్ అమీర్ మాట్లాడుతూ సామ్రాజ్యవాద అమెరికా ఆయుధాలు అమ్ముకునేందుకు ఇతర చిన్న దేశాల పైన దాడులకు ప్రేరేపించడం హేమమైన చర్యన్నారు. తక్షణం ఈ వైమానిక దాడులు ఆపి ప్రజల మానప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జి.ముక్తిర్ అహ్మద్, ఫరీద్, బాబా హుస్సేన్, సాహెబ్ సందాని, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మద్దతు ప్రకటించారు

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సుండుపల్లి

ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన చెక్కులను శనివారం వైసిపి కార్యాలయంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది పేదల ఆరోగ్యం కోసం సిఎం రిలీఫ్ ఫండ్‌ను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రామస్వామిరెడ్డి, సిఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్, పిటిసి ఇస్మాయిల్, సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ బలరాం రాజు, వై ఆనంద్ రెడ్డి, ఉపసర్పంచ్ ఆకుల శివకుమార్, కాలువ ఉపసర్పంచ్ రఫిక్, మైనార్టీ నాయకులు రహీం బాషా, కో-ఆప్షన్ సభ్యులు కలిమ్‌బాషా ముఖ్య నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

జ్వరం, కల్లకలకతో జనం విలవిల

చిన్నారుల్లో అలర్జీ సమస్యలు - అంటు వ్యాధులతో ఆస్పత్రులకు రోగులు

ప్రజాశక్తి-పీలేరు

పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు జ్వరాలు, కల్లకలక సమస్యలతో విలవిల్లాడుతున్నారు. జ్వరం ఏదైనా అది వైరల్ ఫీవరా, మలేరియానా, టైఫాయిడా లేక డెంగీనా అనే అనుమానం, భయంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కొందరు ప్రైవేటు వైద్యులు రోగుల మానసిక బలహీనత, భయాన్ని వారి ఆదాయ వనరులుగా సద్వినియోగం చేసుకుంటున్నారని తెలుస్తోంది. మంచి వైద్యం పేరుతో మరికొందరు ప్రైవేటు ఆసుపత్రుల యజమానులు రోగుల నుంచి బాగానే డబ్బులు దండు కుంటున్నారన్న బహిరంగ ప్రచారం పట్టణంలో జోరుగా జరుగుతోంది. విషజ్వరాలు, డెంగీ వంటి జ్వరాలకు వైద్యం అందివ్వడానికి తమ దగ్గర తగినన్ని సౌకర్యాలు, వైద్య పరికరాలు లేవనితెలిసీ రోగుల బలహీనతను క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. జ్వరంతో ఆసుపత్రికి వెళ్లే రోగుల ఆరోగ్య స్థితి పూర్తిగా దెబ్బతిని ప్లేట్లెట్ల సంఖ్య తగ్గిపోయే వరకు కూడా వారు తమ ప్రయత్నం తాము చేస్తున్నామంటూ కాలం వెళ్లదీస్తున్నారని కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. తీరా పరిస్థితి చేజారాక ఇక తమ వల్ల కాదంటూ మెరుగైన చికిత్స కోసం బయటి ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తీసుకు వెళ్లడమే సరైన మార్గమంటూ ఉచిత సలహాలు ఇస్తూ చేతులు దులుపు కుంటున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. మనిషికి సోకింది సీజనల్ జ్వరమైనా సరే ముందు డెంగ్యూ పరీక్ష చేయించుకోవాలంటూ కొందరు వైద్యులు తమ సొంత ఆదాయం లక్ష్యంగా రక్త పరీక్షనల కోసం మెడికల్ ల్యాబులకు రెఫర్ చేస్తున్నారని బాధితులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

జ్వర బాధితులతో ఆస్పత్రి కిటకిట

ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి కూడా జ్వర పీడితులతో నిండు కుంటోంది. గత రెండు వారాలుగా రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఓపి టికెట్టు, ఆసుపత్రిలో చికిత్స కోసం వైద్యుల గది ముందు, రక్త పరీక్షల కోసం ల్యాబు దగ్గర రోగులు నిండుకుంటున్నారు. జ్వరాలతో వచ్చే వారిలో సీజనల్, వైరల్, విషజ్వరాలు, కంటి కలక, శ్వాస సంబంధిత రోగ బాధితులే అధిక సంఖ్యలో ఓపి టికెట్లు తీసుకుని వైద్యం పొందుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ గది ముందు బారులు తీరిన రోగులు

ప్రజారోగ్యాన్ని కాస్త పట్టించుకోవాలి

ప్రజారోగ్యం పట్ల సంబంధిత అధికారుల నుంచి సరైన స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు. కొన్ని రకాల జ్వరాలకు కారణమైన దోమల నివారణకు సరైన చర్యలు తీసుకోవడంలేదని జనం ఆరోపిస్తున్నారు. పంచాయితీలో ఉన్న ఫాగింగ్ యంత్రాలను కూడా నామమాత్రంగా ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి దోముల నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుకుంటున్నారు.

ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

సాధారణ జ్వరాలతోనే ఆసుపత్రికి రోగులు

మారిన వాతారణం కారణంగా ప్రజలు సాధారణ, వైరల్ జ్వరాలతో బాధపడుతూ ప్రాంతీయ ఆసుపత్రికి వస్తున్నారు. దానికి కంటి కలక సమస్య కూడా తోడై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారుల్లో అలర్జీ సమస్యలు కూడా కనబడుతున్నాయి. దీంతో శ్వాస సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇంకొందరిలో చర్మ సంబంధిత వ్యాధులు కూడా బయట పడుతున్నాయి. ప్రజలు ఆందోళన పడకుండా వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ తగిన ఆరోగ్య సంబంధిత జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలను అనుసరించాల్సి ఉంటుంది. సాధ్యమైనంత వరకు బయటి ఆహార అలవాట్లకు స్వస్తి పలికి ఇంట్లోనే వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. అలాగే కాంచి చల్లార్చిన నీటినే త్రాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అవసరం.

- డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి, పీలేరు.

మోకాళ్లపై టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- ఒంటిమిట్ట: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా జైలుకు పంపినందుకు నిరసనగా ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి ఆదేశాలు మేరకు శనివారం టిడిపి నాయకులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని తెలిపారు. ఆయనపై చేసిన ఆరోపణలకు నేటికీ ప్రభుత్వం సాక్ష్యాధారాలు సమర్పించలేని పరిస్థితిలో ఉందని తెలిపారు. కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, ముస్లిం మైనారిటీ అధ్యక్షులు మహబూబ్‌బాషా, వాణిజ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి కొండవీటి సింహం, జింకా శివ, గంజి సుబ్బరాయుడు, బండి ఓబులేసు, శివ, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, మునిస్వామి, బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గర్జన

ప్రజా'దృష్టి'

కృష్ణాజలాల పున:పంపిణీ తలంపే అక్రమమనే నినాదం మార్మోగిపోయింది. జిల్లాలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, బిజెపి, వైసిపి మినహా మిగిలిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాసంఘాలు పెద్దఎత్తున గర్జించడం తెలిసిందే. కర్నాటక, తెలంగాణలో ఎన్నికల అవసరాల నేపథ్యంలో ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా రాజకీయ అవసరాల కోసం కేంద్రంలోని బిజెపి సర్కారు దిగువ రాష్ట్రాల ప్రజల జీవితాలతో చెలగాట మాడుతోందని చెప్పవచ్చు. కృష్ణాజలాలను ఎపి, తెలంగాణ మధ్య పంపిణీ చేయాలని కేబినెట్ ఆమోదం తెలపడాన్ని చూడాల్సి ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ, వ్యక్తిగత స్వార్థానికిలోనై సమర్థంగా వ్యవహరించడం లేదనే వాదన తర్కానికి నిలుస్తోంది. ఇటువంటి తీవ్రమైన విమర్శల నేపథ్యంలో ముఖ్యమంత్రి సమర్థంగా వ్యవహరించడం ద్వారా రాష్ట్ర ప్రజల తరుపున నిలబడి స్వచ్ఛతను నిరూపణ చేసుకోవాల్సి ఉంది. లేనిపక్షంలో చరిత్ర హీనుడిగా నిలిచిపోతారనే విమర్శ సాకారమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మేల్కోవాల నడంలో సందేహం లేదు. కృష్ణా పరీవాహక ప్రాంతం పరిధిలో కర్నా టక, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉండగా, నలుగురి మధ్య కృష్ణాజలాలను పంపిణీ చేయాలి. కానీ ఎపి, తెలంగాణ మధ్య పంపిణీ చేయాలని పేర్కొంటూ కేబినెట్ ఆమోదించడం, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను ఆదేశించడం చకచకా జరిగిపోయింది. ఎపి, తెలంగాణ రాష్ట్రాల మధ్యే కృష్ణా జలాలను పంపిణీ చేయడం అశాస్త్రీయమని, రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందనే ఆందో ళన వ్యక్తమైంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో రైపేరియన్ రైట్స్ కింద రాష్ట్రానికి కేటాయించాల్సిన అదనపు జలాలతోపాటు నికర జలాలు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందనే వాదన గట్టిగా వినిపిస్తోంది. తెలంగాణ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై స్టే తెచ్చుకోగా, దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతానికి సంబంధించిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఎందుకు స్టే తేవడానికి ఎందుకు ప్రయత్నించలేదని నిలదీశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎదుట లొంగిపోవడం వల్లే రాయలసీమకు అన్యాయం జరుగుతోందని, రాయలసీమ ద్రోహిగా మిగిలి పోయాతారని ఆక్రోశించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ పుట్టినగడ్డ రాయలసీమకు అన్యాయం జరుగుతుండగా, తమ రాజకీయ, వ్యక్తిగత స్వార్థ ప్రలోభాలకులోనై రాయలసీమకు, రాష్ట్రానికి అన్యాయం చేయడం దారుణమనే వాదన వినిపించింది. రాష్ట్రంలోని ఎందరో సీనియర్ అధికారులకు తెలిసినప్పటికీ, సంబంధం లేని వేదికలను ఉద్దేశపూర్వకంగా ఆశ్రయిస్తూ, రాష్ట్రానికి, ముఖ్యంగా రాయలసీమకు అన్యాయం చేస్తున్నారనే వాదన ముక్తకంఠంతో వినిపించింది. కృష్ణాజలాల పున:పంపిణీ చేయాలని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో రాష్ట్రంలోని అఖిలపక్షాలను పిలిచి, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అనంతరం అఖిలపక్షాన్ని ప్రధానమంత్రి ఎదుటకు తీసుకెళ్లడమా, లేక సుప్రీంకోర్టును ఆశ్రయించడమా అనే అంశంపై సంప్ర దింపులు చేయకుండా తీసుకెళ్లకపోవడంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రంలోని భవిష్యత్ తరాలు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన గురుతరమైన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు రాయలసీమ వ్యాప్తంగా కృష్ణాజలాల పున:పంపిణీ అంశాన్ని చర్చనీయాంశం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై స్పష్టమైన ఎజెండాతో ముందుకు కదలాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనికి తుదిరూపు ఇచ్చే ఎజెండాకు రూపకల్పన చేసి, పార్టీల ఎదుట ఉంచుతామని సిపిఎం స్పష్టం చేయడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కృష్ణాజలాల పున:పంపిణీపై రాజ కీయ, న్యాయపరమైన పోరాటాలు ఏ రూపుతీసుకుంటాయో వేచి చూడాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

చీరలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయంలో మహిళలకు దసరా పండుగ సందర్భంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో దసరా పండుగ జరుపుకోవాలని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే వీర మహిళలు కుటుంబ సభ్యులతో పండుగను ఉల్లాసంగా జరుపుకోవాలని చీరలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత కార్యదర్శి రాటాల రామయ్య, నాయకులు ఆచారి వీరయ్య, రజిత, జడ్డ శిరీష పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత : కమిషనర్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

కాలువలు శుభ్రం చేస్తున్న కార్మికులు

పట్టణ పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యతనిస్తున్నట్లు నగర పంచా యతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్ర మంలో భాగంగా శనివారం పట్టణంలోని జ్యోతి చౌక్, ఆర్టీసీ బస్టాండ్, రంగస ముద్రం రోడ్డు, హట్కో కాలనీ, తదితర ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రత కార్య క్రమాన్ని నిర్వహించారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేసి, చెత్తాచెదా రాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో గతంతో పోల్చుకుంటే పారిశుద్ధ్యం బాగా మెరుగు పడిందన్నారు.పట్టణ ప్రజలు సైతం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన పెంచుకొని నగర పంచాయతీ సిబ్బందికి సహకరిస్తున్నారన్నారు. ప్రభుత్వం పట్టణాల పరిశుభ్రత కోసం క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పం వంటి కార్యక్రమాలను ప్రవేశపె ట్టిందన్నారు. కార్యక్రమాలను పట్టణంలో నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. స్వచ్ఛసర్వేక్షన్ సర్వేలో పట్టణానికి మెరుగైన ర్యాంకు తీసుకు రావడమే తమ లక్ష్యమని కమిషనర్ వెల్లడించారు.పరిశుభ్రత పనులు ఎప్పటికప్పుడు అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి అందుబాటులో ఉంటూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

నిబంధనల మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మచెరువుమిట్ట వద్ద జాతీయ రహదారి అలైన్మెంట్‌కు విరుద్ధంగా జాతీయ రహదారిని మలుపులు తిప్పడాన్ని వ్యతిరేకిస్తు సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి మాట్లాడుతూ అమ్మచెరువుమిట్ట నుండి అంగళ్లు వరకు ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయని తెలిపారు. ప్రమాదకరమైన మలుపులు తొలగించడానికి హైవే అథారిటీ వారు సర్వే నిర్వహించి ఆర్అండ్‌బి స్థలంతోపాటు ప్రయివేట్ స్థలాలను గుర్తించి భూమి కోల్పోయిన వారందరికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడానికి అలైన్మెంట్ ఇచ్చిందని పేర్కొన్నారు. హైవే అలైన్మెంట్‌ను నిబంధనలను తుంగలోదొక్కి రహదారిని మలుపుతిప్పడం కేవలం వ్యక్తి ప్రయోజనం కోసమేనని, వ్యక్తుల ప్రయోజనం కోసం వ్యవస్థ ప్రయోజనాలను తాకట్టుపెట్టడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైవే అలైన్మెంట్ ప్రకారమే రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొన భాస్కర్, సూరి, దేవ, రెడ్డెప్ప, తిరుమల, మౌలాలి బాషా, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా ఖలీల్ అహ్మద్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఖలీల్ అహ్మద్

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు పాగొండ ఖలీల్ అహ్మద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆయనకు నియామక ఉత్తర్వులను అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తాను చేసిన సేవలను గుర్తించి రెండవసారి తనను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ పదవి దక్కడానికి సహకరించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిదిన్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. రాబోవు శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైసిపిని అఖండ మెజారిటీతో గెలిపించు కుంటామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ పాగొండ ఖలీల్ అహ్మద్ వైసిపి ఆవిర్భావం నుండి పార్టీకి వినయ విధేయుడుగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి రెండవసారి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించి సముచిత స్థానం కల్పించడం శుభ పరిణామన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మండల వైసిపి అధ్యక్షులు ప్రదీప్‌రెడ్డి, వైసిపి పట్టణం అధ్యక్షుడు సిఆర్ చిన్నికృష్ణ, భీమ్‌గాని ప్రభాకర్‌రెడ్డి, రాయల్ సలీం జి.చాంద్ భాషా, టి.జనార్ధన్, నరసింహనాయుడు నక్క సంతోష్, జి.వి.రామకృష్ణ, రమేష్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి అయుబ్ భాష, సల్మాన్, సద్దాం, సాయి చరణ్ తెలిపారు.

పవన్ నుంచి నియామక పత్రం అందుకున్న మహేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్నికైన మైఫోర్స్ మహేష్ నియామకపుత్రాన్ని అందజేశారు. పార్టీ పెట్టినప్పటి నుంచి మహేష్ ప్రతి పార్టీ కార్యక్రమాన్ని ప్రజలకు తీసుకెళ్తున్నారని అతని సేవలు గుర్తించి జనసేన పార్టీ రాష్ట్ర సమితి కార్యదర్శిగా నియమిస్తున్నామని తెలియజేశారు. జనసేన పార్టీలోకి వచ్చే ప్రతి నాయకులు పదవి ఆశించి పార్టీలోకి రాకుండా ప్రజల బాగోగులు పార్టీని అభివృద్ధి చేయడం కోసం పనిచేయడమే ముఖ్య ఉద్దేశంగా పార్టీలకు రావాలని పవన్ కళ్యాణ్ సూచించారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా టిడిపి జనసేన కూటమి అధికారంలోకి వచ్చి ఈ రాక్షస పాలనని అంతం అందించే విధంగా మీ మీరు పనిచేయాల్సిందిగా మహేష్‌కి సూచించారు. చిత్తూరు జిల్లాలో ప్రతి కార్యక్రమంలో ఆక్టివ్‌గా పనిచేస్తున్న మహేష్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. మున్ముందు చిత్తూరు జిల్లాలో జనసేన పార్టీ బలోపేతం కొరకు కృషి చేయాలని తెలిపారు. తనను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు మహేష్ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్, పిఎస్ చైర్మన్ నాదెండ్ల మనోహర్ని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

మహేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న పవన్‌కల్యాణ్

రైతులకు 'అమూల్' దసరా కానుక : కలెక్టర్

కేంద్రానికి పాలు పోస్తున్న మహిళలు

ప్రజాశక్తి - రాయచోటి

దసరా పండుగ కానుకగా జగనన్న పాలవెల్లువ పథకంలో భాగస్వాములైన 4037 మంది రైతులకు అమూల్ సహకార సంఘం వారు నగదు ప్రోత్సాహకాన్ని రైతుల బ్యాంకు అకౌంట్లకు విడుదల చేసినట్లు కలెక్టర్ గిరీష తెలిపారు. సహకార రంగంలో పాల డెయిరీలను బలోపేతం చేసే లక్ష్యంతో అంతర్జాతీ యంగా పేరు పొందిన అమూల్‌తో కలిసి ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో జగనన్న పాలవెల్లువ పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా ఎంతో మంది రైతులు, స్వయం సహాయక సంఘాలలోని మహిళలు అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్నారు. ఈ పథకం ద్వారా అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్న అర్హులైన ఎంతోమంది రైతులకు అమూల్ సహకార సంఘం వారు నగదు ప్రోత్సాహకాన్ని ఇచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోందని, కార్యక్రమం ద్వారా ఎంతో మంది రైతులు అమూల్ కేంద్రా లకు పాలు పోస్తున్నారని తెలిపారు. కార్యక్రమం ద్వారా గతంలో కంటే ఎక్కువ లాభాన్ని గడిస్తున్నారని తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా జిల్లాలోని 4037 మందికి గాను దాదాపు రూ.65 లక్షలను అమూల్ సహకార సంఘం వారు నగదు ప్రోత్సాహకం ఇచ్చారని పేర్కొన్నారు. అక్టోబర్ 2022 నుంచి సెప్టెంబర్ 2023 వరకు 182 రోజుల కంటే ఎక్కువ రోజులు పాలు పోసిన వారు దీనికి అర్హులని చెప్పారు. ఎన్ని లీటర్లు అయితే పాలు పోస్తారో అన్ని లీటర్లకు లీటరుకు 50 పైసల చొప్పున ప్రోత్సాహకం ఇచ్చారన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ పండుగ సందర్భంగా అమూల్ వారు విడుదల చేసిన నగదు ప్రోత్సా హకం పొందిన రైతులందరికీ అభినందనలు తెలిపారు. జగనన్న పాల వెల్లువ పథకాన్ని రైతులందరూ వినియోగించుకొని, వారి జీవన ప్రమా ణాలను మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ అమూల్ ద్వారా నగదు ప్రోత్సాహకం పొందిన రైతులందరికీ అభినందనలు తెలిపారు. పాడి పశువుల ద్వారా జీవనం సాగించే వారికి పశు కిసాన్ క్రెడిట్ కార్డుల సౌలభ్యం ఉందని, ఈ సౌలభ్యాన్ని రైతులు ఉపయోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు.

ప్రతి కుటుంబ సంక్షేమ బాధ్యత ప్రభుత్వానిదే : 'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న శ్రీనివాసులు

ప్రతి కుటుంబ సంక్షేమం ప్రభుత్వ బాధ్యతని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని పివిజి పల్లె గ్రామ సచివాలయ పరిధిలోని కొండంపల్లి హరిజనవాడ, దేగవాండ్లపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి ప్రతి గడపగడపకూ తిరిగి ప్రభుత్వం నుంచి వారికి అందుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రజల నుంచి వస్తున్న వినతులను స్వీకరించారు. సమస్యలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యను వారి సమక్షంలోనే పరిష్కరించారు. గ్రామంలో నాడు-నేడు పనులను పరిశీలించి ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులను కల్పిస్తుందని తెలియజేశారు. ఇది ప్రజల ప్రభుత్వం అని ప్రజల వద్దకే పాలనని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను పరిష్కరించాలని ప్రతి గడపకు తిరగాలని తెలియజేయడం వల్ల గ్రామాలలో కొన్ని వేళలు సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల పట్ల గ్రామీణ ప్రజలు, రోజు కూలీ పని చేసుకునేవారు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలియజేశారు. మూడు సంవత్సరాల పాలన ముగిసిన తర్వాత ఎంతో ప్రతిష్టాత్మకంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్ద బాబుల్ రెడ్డి, మండల కన్వీనర్ ముస్తాక్, రామనాథం, దళవాయిపల్లె మాజీ సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ రఘురాం, ఎస్ఐ రఘురాం, సచివాలయ అధికారులు, వాలంటీర్లు, గృహసారథులు పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష : 'మేడా'

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామరక్ష లాంటిదని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం సోమవరం పంచాయతీలోని పుత్తావాండ్లపల్లిలో నిర్మించిన సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. ముందుగా పుత్తావాండ్లపల్లిలో వెలసిన పాలకొండ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష అనేది పేద ప్రజల వరం లాంటిదని చెప్పారు. కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోని ప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను పరీక్షించి తగిన మందులు అందజేస్తారన్నారు. అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సౌకర్యం కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, విఆర్ సంస్థల అధినేత విఆర్ రెడ్డి, జడ్పిటిసి శివరాం గౌడ్, సర్పంచ్ సాయి నేహ రెడ్డి, మండల సీనియర్ నాయకుడు గాలివీటి వీర నాగిరెడ్డి , స్థానిక వైసిపి నాయకులు మధుసూదన్ రెడ్డి, కుళాయి రెడ్డి, పద్మనాభ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, రూరల్ సితులసీరామ్, ఎంపిడిఒ మల్లేశ్వరి, తహశీల్దార్ మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు నాగిరెడ్డి నేతి ఆంజనేయులు, గోపీనాథ్ రెడ్డి, రవి, ఒదివీడు శివ, వైద్య సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి:** పేద ప్రజల ఆరోగ్య పక్షపాతి ముఖ్యమంత్రి జగన్ అని కలికిరి జిల్లా వైద్య, విద్య స్టాండింగ్ కమిటీ సభ్యులు కాకర్ల పద్మజాలోకవర్ధన్, గుట్టపాలెం సర్పంచ్ రెడ్డివారివెంకట్‌రెడ్డి అన్నారు. గుట్టపాలెం సచివాల యంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిడిఒ గంగయ్యతో కలసి పద్మజ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రజలు అందరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీ సచివాలయం పరిధిలో ముందస్తు ఇంటింటి సర్వే పూర్తి ఐన పిదప టోకెన్స్ అందచేసి క్యాంప్ లకు ప్రజలు హాజరయ్యే విదంగా వాలంటీర్లు, ఆశాకార్యకర్తలు, ఎఎన్ఎమ్‌లు, సిహెచ్ఒలు కృషి చేయాలని కోరారు. గుట్టపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఆరోగ్యం ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందాలని, తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌లో సుమారు 100 మందికి చికిత్సలు అందచేసి వారి వివరాలు ఆన్‌లైన్ చేశామని పేర్కొన్నారు. 21 మందిని ఉన్నత చికిత్స కొరకు రెఫెర్ చేశామని తెలిపారు.

కలికిరి : ఆరోగ్య సురక్షను పరిశీలిస్తున్న పద్మజాలోకవర్ధన్

శిశువులకు టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-పీలేరు: వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి తల్లికీ తెలిసినప్పుడే సంపూర్ణ ఫలితాలు ఉంటాయని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. శనివారం డిఐఒ పట్టణంలోని చెన్నారెడ్డి వీధులో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి, తల్లులకు ఆరోగ్య సూచనలు, సలహాలు ఇస్తూ ప్రస్తుతం మాత శిశు మరణాలు తగ్గడానికి ప్రధాన కారణం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమమేనని అన్నారు. క్షయ, పోలియో, కామెర్లు, కంఠసర్పి, కోరింతదగ్గు, ధనుర్వాతం, మెదడువాపు, నిమోనియా, తట్టు, రూబెల్లా, అంధత్వం మొదలగు భయంకరమైన వ్యాధులు ఈ టీకాలతోనే నిర్మూలించ వచ్చుని, తల్లులకు వివరించారు. వారికి ఇచ్చిన టీకా ఏది, ఏ టీక ఏ వ్యాధి రాకుండా అరికడుతుంది, టీకాలు వేశాక ప్రతికూల ప్రభావాలు వాటి నివారణ, తదుపరి టీకాలు ఎప్పుడు ఎక్కడ వేస్తారు, కార్డు జాగ్రత్తగా ఉంచుకోవల్సిన అవసరం గురించి డాక్టర్ ఉషశ్రీ పిల్లల తల్లులకు వివరించారు. అనంతరం ఆమె రిపోర్ట్లు, రికార్డు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎఎన్ఎం విజయకుమారి, సిహెచ్ఒ,అయేషా పాల్గొన్నారు.

CHANGE OF NAME

లవని హసీనా బేగం భర్త L. ఇస్మాయిల్ ఖాన్ (కొత్త పేరు) ఇంతకుముందు పఠాన్ హసీనా బేగం(పాత పేరు) అయిన నేను డోర్ నెంబర్.6-237-G-8-46-1, దేవళం వీధి ,మదనపల్లి టౌన్ అండ్ మండలం,అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్. 517325. నందు నివసిస్తూ ఉన్నాను అయితే తన పాత పేరుకు(పఠాన్ హసీనా బేగం) బదులుగా ఇకపై నేను జరిపే అన్ని లావాదేవీలు నా యొక్క కొత్త పేరు అయినా లవని హసీనా బేగం పైననే జరుపుతానని తెలియజేస్తున్నాను.

ఇట్లు: లవని హసీనా బేగం మదనపల్లి.

జానపద గేయ సాహిత్యంపై షాలినికి డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డాక్టర్ శాలిని

జానపద గేయ సాహిత్యంపై చేసిన పరిశోధనలకుగాను తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి తెలుగు విభాగపు పరిశోధక విద్యార్థిని పి.షాలిని డాక్టరేట్ అందుకొన్నారు. 2017 సంవత్సరంలో పిహెచ్ డిలో చేరి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య మూలే విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో వై.జి.సురేంద్ర సతీమణి పి.షాలిని 6 సంవత్సరాల కాలంపాటు పరిశోధనలు చేసి యూనివర్సిటీకి సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టరేట్ అందుకున్న పి.షాలిని మాట్లాడుతూ తాను ఇది వరకే ఎం.ఎ, ఎంఇడి, ఎంఫిల్ పూర్తి చేసి పిహెచ్‌డిలో 2017 చేరడం జరిగిందని వెల్లడించారు. తొలుత కురబలకోట భజన పాటలపై ఎంపిల్ పూర్తి చేసిన అనంతరం ఆరు సంవత్సరాల కాలం పాటు ఫీల్డ్ వర్క్ పైన రీసెర్చ్ చేసి పరిశోధన పత్రం సమర్పించడం జరిగిందని చెప్పారు.ముఖ్యంగా అంతరించిపోతున్న సాంస్కృతిక సాంప్రదాయ ఆచార వ్యవహారాలు కురబలకోట మండల జానపద గేయసాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే సదుద్దేశంతో రీసెర్చ్ చేయడం జరిగిందని వెల్లడించారు.కురబలకోట మండల జానపద గేయ సాహిత్యం మరుగున పడకుండా వారసత్వ సంపదగా భవిష్యత్తు తరాలకు అందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందులో కురబలకోట మండలంలో జానపద కళలు, సంస్కృతిని గురించి సవివరంగా తెలియజేశామని స్పష్టం చేశారు.

మంగళగిరిలో టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరై జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, నాయకులు బత్యాల చెంగల్రాయుడు, కిషోర్‌కుమార్‌రెడ్డి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, డైరెక్టర్

'ఆదిత్య'లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి సమీపంలోని స్థానిక పుంగనూరు రోడ్డులో గల ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం రోజు ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం.లక్ష్మీ కాంత్‌రెడ్డి ప్రిన్సిపల్ ఆఫ్ మదర్ తెరిసా ఇంజినీరింగ్ కాలేజ్ మాట్లాడుతూ జిల్లాలోని క్రమశిక్షణ గల రెండు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ ఒకటని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అధ్యాపకులను తల్లిదండ్రులను గౌరవించాలని నిర్దేశించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని వారికోసం ఎంతో మంచి భవిష్యత్తు ఉందని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి ముఖ్య అతిథి, కళాశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఎన్.నాగ మల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మీనాక్షిదేవి అలంకారంలో వాసవి మాత

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 7వ రోజు శనివారం మీనాక్షి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గ్రామ పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం, నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆ మొక్కలను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఉభయ దారులు గెలివి రత్నం శెట్టి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులు గెలివి జయలక్ష్మి, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో పలు ఆలయాలలో ఏడవరోజు శనివారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మల్లయ్య కొండపై వెలసిన గౌరీదేవి ఆలయంలో అమ్మవారికి పూజారి శేఖర్ లలిత త్రిపుర సుందరీగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. **లక్కిరెడ్డిపల్లి :** లలితాదేవి అలంకారంలో సర్వమంగళా దేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకులు కేసరి స్వామి అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి తీర్థ ప్రసాదాలు భక్తులకు పంచిపెట్టారు. ఆలయ వ్యవస్థాపకులు ఓబులేశ్వరమ్మ, ధర్మకర్త మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సూర్యుడు నాయక్, సుధాకర్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుదర్శన్ బాబు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఉపయోగకరంగా సోలార్ లైట్లు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి చిరు వ్యాపారులకు ఇటీవల అందజేసిన సోలార్ రేట్లు వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. రాత్రివేళల్లో తోపుడు బండిపై పండ్లు, కూరగాయలు ఇతర వ్యాపారాలు నిర్వహించుకుంనేందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. సోలారు లైట్లు వల్ల తమకు ఎక్కువసేపు వీధుల వెంట వ్యాపారం చేసుకొని వచ్చే వీలుగా ఉందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చీకటి పడే వరకు వ్యాపారం చేసుకొని వెళ్లే వారమని, ఇప్పుడు సోలార్ లైట్లు రావడంతో ఎక్కువ సేపు వ్యాపారం చేసుకునే వీలుందని వెల్లడించారు. ఎంపీ, ఎమ్మెల్యే, నగర పంచాయతీ కమిషనర్ మనోహర్‌కు తోపుడుబడ్ల వ్యాపారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మహార్యాలీకి తరలివెళ్లిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పుట్టపర్తి జిల్లా కదిరి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం మహార్యాలీ, భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గం బాధ్యులు ఎస్.రెడ్డి సాహెబ్, నాయకులు సురేంద్రరెడ్డి, మహబూబ్ పీర్, చలపతి, డాక్టర్ ఎస్.కె.బాషాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ఉత్సాహం ఉరకలేస్తోందని, పాత కొత్తతరం నాయకులతో కళకళలాడుతోందని చెప్పారు. రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడోయాత్ర పార్టీ శ్రేణుల్లో సరికొత్త జోషను నింపిందని పేర్కొన్నారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో ర్యాలీ, బహిరంగ సభలు నిర్వ హించడం జరుగుతోందన్నారు. ఈ సభలకు ప్రజలు పెద్దఎత్తున తరలి వస్తుండడం శుభపరిణామమన్నారు. వచ్చే ఏడాది జరిగే దేశ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని పేర్కొన్నారు.

మన భూమి-మన దేశం కలశ యాత్ర

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

దేశ రక్షణ కోసం ప్రాణతాగం చేసిన వారిని స్మరించుకోవడం ప్రజలు వారికిచ్చే గౌరవం అని నెహ్రూ యువజన కేంద్ర జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు శనివారం లక్కిరెడ్డిపల్లి మండల సభ భావనంలో మనభూమి మనదేశం కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని స్మరించుకునేందుకు కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదన్నారు. ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరించి దేశ నిర్మాణంలో అన్ని గ్రామాల భాగస్వామ్యం చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ అమృత కలశాలలో సేకరించిన మట్టితో ఢిల్లీలో ప్రధానమంత్రి అమృత వాటిక ఏర్పాటు చేస్తారని తెలిపారు. దేశం కోసం మరణించిన, జీవించిన అజ్ఞాత స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవలన్నారు. దేశం కోసం పనిచేస్తున్న జవాన్లను స్మరించుకోవలన్నారు. మాజీ జవాన్లు అయిన వెంకట్రామిరెడ్డి, రమణారెడ్డిని సన్మానించారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం జీవించాలన్నారు. ఈ కలశ యాత్రలో మట్టి కలశాలను, భారత జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ చక్రి నాయక్ మండల అభివృద్ధి అధికారి వెంకట్రామిరెడ్డి, శ్రీ వెంకటేశ్వర యూత్ డెవెల్పమెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర, యువజన కార్యకర్తలు బాలాజీ, రంజిత్, నరేశ్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మణికంఠ